క్లుప్తంగా

మైనార్టీ విద్యార్థులకు నేరుగా అడ్మిషన్లు

వేంపల్లె : ఏపీ గురుకుల పాఠశాలలో చేరేందుకు మైనార్టీ విద్యార్థులు నేరుగా అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ సుగుణమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బాలికల కోసం వేంపల్లె, బాలుర కోసం కడపలోని రామాంజనేయపురం గురుకుల పాఠశాలలో నేరుగా అడ్మిషన్లు పొందగలరన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కామన్ ఎంట్రెన్స్ రాత పరీక్షలు ఉంటాయన్నారు. ఈనెల ఆఖరులోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25న కామన్ ఎంట్రెన్స్ పరీక్షలు ఉండనున్నట్లు ఆమె వెల్లడించారు. మరింత సమాచారం మేరకు ఏపీ గురుకుల పాఠశాలను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల వైద్యనిపుణులు, గుండెజబ్బుల శస్త్ర చికిత్స నిపుణులు ఆసుపత్రికి రానున్నారని, చర్మసమస్యలు, గుండెజబ్బులతో షుగర్ వ్యాధులతో బాధపడుతున్న పులివెందుల, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇ.సి.దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు వారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

భక్తులతో కిక్కిరిసిన గండి క్షేత్రం



భక్తులతో నిండిన గండి క్షేత్రం

చక్రాయపేట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధి శనివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగునున్న తమిళనాడు, కర్నాటక రాష్ట్రలకు చెందిన భక్తులు పొలతల జాతరకు వెళ్లి అక్కడి నుంచి గండిక్షేత్రానికి వచ్చి వీరాంజనేయస్వామిని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో ఆలయ అధికారి, పాలకమండలి, సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన ఉప ప్రదాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తుల వాహనాలు ఎక్కువగా ఉండటంతో రాక పోకలకు అంతరాయం కలిగింది. ఏర్పాట్లను ఆలయ అధికారి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజలు పర్యవేక్షించారు.

వైభవంగా సాగిన శివ, పార్వతుల కల్యాణం



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న ఉభయదారులు

వీరపునాయునిపల్లె : స్థానిక సంగమేశ్వరాలయంలో శనివారం శివ, పార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులను తేరుపై ఉంచి మంగళ వాయిద్యాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులచే ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనిమెల సంగమేశ్వరాలయంలో రెండు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. చైర్మన్ ఎన్‌పీ శివాంజనేయరెడ్డి, ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్సవాలకు ఆర్థిక సహాయం చేసిన దాతలకు, ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చూసుకున్న పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పొలతలలో తాత్కాలిక హుండీ లెక్కింపు

పెండ్లిమర్రి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతల క్షేత్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీలను శనివారం ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనువాసులుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఉత్సవాల మూడు రోజులకు గానూ మల్లేశ్వర స్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి వద్ద ఉన్న తాత్కాలిక హుండీలను లెక్కించగా రూ.11,38,124 లక్షలు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.3,52,500, అంగడి బాడుగల ద్వారా రూ.45,600, అర్జిత సేవల ద్వారా రూ.10,82,165 నగదు లభించిదన్నారు.

కమలాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరు

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ఆర్టీసీ బస్టాండు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

కమలాపురం : కమలాపురం అభివృద్ధిని ఎవరూ ఆపలేరు అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అలాగే తాను చదువుకున్న చోటే బస్టాండును నిర్మించడం సంతోషంగా ఉందని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో రూ.1.08 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఆర్టీసి బస్టాండును ఆర్టీసి అధికారులతో కలసి చైర్మన్, ఎమ్మెల్యేలు బస్టాండు సమీపంలోని కోట గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బస్టాండు, కౌంటర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకు ముందు క్రాస్ రోడ్డు వద్ద రూ. 5.75 కోట్లతో నిర్మించిన ఆర్చి, సీసీ రోడ్డు, బ్యూటిఫికేషన్, డివైడర్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసి చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న ఊర్లో అత్యాధునిక హంగులతో బస్టాండు నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కమలాపురంలో డిపో పెట్టాలని తాను, ఎమ్మెల్యే భావించామని అయితే స్థలాభావంతోనే ఆ నిర్ణయాన్ని విరమించుకుని ఇదే బస్టాండును ఆధునీకరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి అరగంటకు ఒక బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇపుడు వస్తున్న కోగటం, మైదుకూరు బస్సులతో పాటు కమలాపురం రైల్వే గేటు వరకు వచ్చే షటిల్ సర్వీసును బస్టాండు వరకు వచ్చేలా ఆదేశించామన్నారు. పులివెందుల, అనంతపురం నుంచి కమలాపురం మీదుగా బద్వేలు, నెల్లూరు వరకు బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురంలో ఇప్పటికే వందల కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. క్రాస్ రోడ్డు నుంచి అభివృద్ధి కళ్లకు కనబడుతుందన్నారు. మార్కెట్ యార్డులోనే రెండు వైపుల షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఆర్చి, సీసీ రోడ్డు, డివైడర్, మున్సిపల్ భవనం, ఆసుపత్రి, పాలిటెక్నిక్ కళాశాల భవనం, ఆర్టీసీ బస్టాండు, మధ్య మధ్యలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించామన్నారు. పట్టణం అంతా డ్రైనేజ్, స్ట్రాం వాటర్ డ్రైనేజ్ నిర్మించామన్నారు. అభివృద్ధి కేవలం ఈ ఐదేళ్లలో జరిగిందన్నారు. ఆరు సార్లు ఆర్‌ఓబీకి టెండర్లు పిలిచామని, బురదజల్లక పోతే ఓపెన్ టెండర్లులో పాల్గొని ఆర్‌బీఓలు టీడీపీ నాయకులే నిర్మించవచ్చు కదా అని ప్రశ్నించారు. తనకు చిత్తశుద్ధి ఉంది కాబట్టే తాను ఆర్‌ఓబీని ప్రణాళికా బద్ధంగా నిర్మాణ పనులు చేపట్టానన్నారు. టీడీపీ హయాంలో కేవలం అప్పటి మంత్రి ఆదితో టెంకాయతో కొట్టి ఆర్‌ఓబీ పనులు ప్రారంభించామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా టీడీపీ వారికి మనుషులు దొరకక పోవడంతో వారి ఫేక్ మనుషులకే కండువాలు వేసి 200–300 మంది టీడీపీలో చేరారని సోషల్ మీడియా ఫేక్ ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గంగవరం, విభరాపురం మీదుగా కడప–ప్రొద్దుటూరు బస్సు సర్వీసు కావాలని ప్రజలు అడిగారని తప్పక ఈ సర్వీసు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సీఎస్ నారాయణరెడ్డి, గంగాధర్‌రెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌పీఎస్‌ఆర్, సాదిక్, ఇర్ఫాన్, గఫార్, లక్ష్మీనారాయణరెడ్డి, చెన్న కేశవరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు బీపీ పరీక్షలు నిర్వహిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్లు

లింగాల : ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం కింద శనివారం లింగాల పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కళ్యాణ్ దినకర్ గర్భిణులకు బీపీ, షుగర్, బరువు, వారి ఆరోగ్య స్థితిగతులను పరీక్షించారు. ప్రతి మహిళ మాతృత్వాన్ని సురక్షితంగా నిర్వహించేందుకు వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తల్లి బిడ్డల ఆరోగ్యమే ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన పథకం ఉద్దేశమన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని 43 మంది గర్భిణులకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కుసుమకుమారి, ఆశాబేగం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం



మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డితో బూత్ కమిటీ సభ్యులు

పులివెందుల టౌన్ : స్థానిక పెద్దకొండప్ప కాలనీ, ఎస్‌బీఐ కాలనీ సచివాలయాల పరిధిలోని 85, 86, 88, 89, 90, 91, 92, 93 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి శనివారం వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసం వద్ద మేము సిద్ధం..మా బూతు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్లు హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు చంద్రమౌళి, పార్నపల్లి కిశోర్‌లు పాల్గొని బూత్ కమిటీలోని కన్వీనర్లకు, బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల్లో చేయాల్సిన విధివిధానాలను దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలు మనకు ఎంతో ప్రాముఖ్యమైనవని, ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని కోరారు. అందుకోసం ప్రతి ఓటరును కలిసి పథకాలను వివరిస్తామని బూత్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు కోడి రమణ, శ్రీరామ్, రమేష్, కనక, లక్ష్మిభార్గవి, జగదీశ్, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్లు ఖాదర్, కోఆప్షన్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, సర్వారెడ్డి, శేఖర్ నాయుడు, రాజేష్‌నాయుడు, పెద్దమాబు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు పెద్దపీట వేసింది వైఎస్ కుటుంబమే



ఎమ్మెల్యే, చైర్మన్‌లను సన్మానిస్తున్న ముస్లిం మత పెద్దలు

కమలాపురం : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు పెద్ద పీట వేసింది వైఎస్ కుటుంబమేనని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక జుమ్మా మసీదులో ప్రభుత్వ ఖాజీ నాసీర్ హుసేని వితరణ చేసిన దుస్తులను మండలంలోని అన్ని మస్జిద్‌లకు చెందిన ఇమాం, మౌజన్‌లకు వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి వారి అభ్యున్నతికి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బీజం వేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ముస్లింలు ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిర పడ్డారన్నారు. ప్రస్తుతం సీఎం ముస్లింలకు సుస్థిర స్థానం కల్పించారన్నారు. డిప్యూటీ సీఎం హోదా ముస్లింకు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం కూడా 7 ఎమ్మెల్యే స్థానాలు ముస్లింలకు కేటాయించారన్నారు. టీడీపీ కేవలం ఒక్క స్థానానికి మాత్రమే ముస్లింలకు కేటాయించిందన్నారు. ఇది మనందరి ప్రభుత్వం అని, మరో సారి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు లాగా జగన్‌కు నటించడం రాదని చెసేదే చెబుతాడన్నారు. మీకు ఏ సమస్య వచ్చిన నాకు ఏటైంలో అయినా ఫోన్ చేస్తే చాలని మీ సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మత పెద్దలు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ స్టేట్ కమిషన్ మెంబర్ హిదాయత్, మండలంలోని అన్ని మస్జిద్‌ల ఇమాంలు, మౌజన్‌లు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖు స్థాపనలు

పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి శంఖు స్థాపనలు చేశారు. రూ. 20 లక్షలతో పుట్లంపల్లె యానాదీ కాలనీలోని సీసీ రోడ్లు, పుట్లంపల్లె–ఇందిరమ్మ కాలనీలను కలిపే కావలుపై కల్వర్ట్ పనులతో పాటు రూ.35 లక్షలతో బీడి కాలనీలో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామ పంచాయతీలోని ఉలవలపల్లె ఎస్సీ కాలనికి చెందిన పలువురు శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీ లోకి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్ష్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దుగ్గాయపల్లెలో అన్నదానం

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి పొలతల పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి వెళుతున్న భక్తులకు పెద్ద లేబాక గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యులు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్థానికులు, గ్రామ పెద్దల సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలో 20 కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

యర్రగుంట్ల : మండలంలోని మేకలబాలయపల్లె గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి శనివారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సమక్ష్యంలో చేరారు. వీరిందరికీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె పెద్ద రామాంజనేయులు, రామాంజి, పి.చిన్నరామాంజనేయులు, నాగేంద్ర, సంజీవలతో పాటు 15 కుటుంబాలు వారు ఉన్నారు. కార్యక్రమంలో కలమల్ల, మేకలబాలయపల్లె గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తిరుణాల



సిరిబండి మహోత్సవం

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మ చింతలలో అమ్మవారికి శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని మరుసటి రోజు గంగమ్మ చింతలలో సిరిబండి మహోత్సవం నిర్వహిస్తారు. సిరిబండికి భాను గొర్రెను కట్టి తుమ్మలపల్లె గ్రామం నుంచి ఊరేగింపుగా గంగమ్మ చింతలకు చేరుకుని అక్కడ అమ్మవారికి జంతుబలులు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో కోరిన కోరికలు తీర్చే గంగమ్మ అమ్మవారుగా ఎంతో ప్రసిద్ధి చెందారు. ఆలయ అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలో వెలసిన శ్రీగంగమ్మ–పోలేటమ్మ ఆలయం ఆవరణలో శనివారం గంగమ్మ తిరునాల ఘనంగా జరిగింది. ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం మరుసటి రోజున జరిగే ఈ తిరునాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఆలయంలో వెలసి శ్రీగంగమ్మ, శ్రీ పోలేటమ్మలను దర్శించి మొక్కులు చెల్లించారు. ఆలయంలోని విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. తిరునాల నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీగంగమ్మ విగ్రహం

ఘనంగా జ్యోతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత



పెద్దకుడాలలో జ్యోతుల ఉత్సవం

లింగాల : మండలంలోని పెద్దకుడాల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన గంగమ్మ దేవతకు కంకణధారన సందర్భంగా జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి ఇంటి వద్ద నుంచి అమ్మవారి భరణాలను, పట్టువస్త్రాలను జ్యోతులు, డప్పుల మేళాలతో అమ్మవారి గుడికి తీసుకెళ్లారు. అమ్మవారిని ఆభరణాలు, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి తిరుణాలకు శ్రీకారం చుట్టారు. శనివారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు అమ్మవారి ఆలయం వద్ద ఉదయం, సాయంత్రం డప్పులు, మేళాలతో తిరుణాలకు అమ్మవారిని మేలుకొలుపుతారని గ్రామస్తులు తెలిపారు. ఆలయం వద్ద ధ్వజస్తంభంపై 17వ తేదీ వరకు అఖండ జ్యోతిని వెలిగింపజేస్తారు. ఈ నెల 17వ తేదీన పెద్దకుడాల, చిన్నకుడాల గ్రామాల్లో గంగమ్మ తిరుణాల నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. తిరుణాల రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి చెక్కభజనలు, కోలాటాలు నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమై శనివారంతో ముగిశాయి. ఉత్సవాలకు జిల్లా నలుమూల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ చైర్మన్ అంబటి రాజగోపాల్‌రెడ్డి, ఈఓ శ్రీనువాసులులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మంచి జరిగితేనే మరో అవకాశం కల్పించండి



వికలాంగుడి సమస్య వింటున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల వల్ల ప్రజలు లబ్ధి పొంది ఉంటేనే వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేగా మూలె సు.దీర్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం మోరగుడి గ్రామంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎంపికైన నాలుగున్నర సంవత్సరాల కాలంలో చిన్న సంఘటనలు కూడా నియోజకవర్గంలో జరుగలేదన్నారు. గత టీడీపీ పాలనలో వారు ఫ్యాక్షన్ ను ప్రోత్సహించేవారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయాడన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాడన్నారు. కార్యక్రమంలో బడిగించల చంద్రమౌళి, యాసోబు, గ్రామ నాయకులుతదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు



పట్టణంలో కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు

జమ్మలమడుగు : నియోజకవర్గంలో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ టీడీ యశ్వంత్ తెలిపారు. శనివారం పట్టణంలోని పురవీధులలో సీఆర్‌పీఎఫ్ దళాలతో ఆయన కవాతు నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అన్ని చర్యలను చేపట్టామన్నారు. సమస్యలను సృష్టించిన వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని సమస్యలు సృష్టించేవారిపై, రౌడీషీటర్లపై ఆయా స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని స్థానిక వీధుల్లో శనివారం కేంద్ర బలగాలు సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ప్రజలు ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా అన్ని చర్యలను చేపట్టామన్నారు. ఎన్నికల్లో సమస్యలు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గంగమ్మ జాతర

చింతకొమ్మదిన్నె : స్థానిక గంగమ్మతల్లి జాతరను ఈనెల 11, 12న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బీపీ విశ్వనాథరెడ్డి, ఈవో పోతు సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 21న నిండు తిరుణాల అదే రోజు మధ్యాహ్నం బండలాగుడు పోటీలు, కోలాటంతో పాటు రాత్రికి అమ్మవారి కల్యాణం, 22న మైల తిరుణాల జరగనునన్నట్లు తెలిపారు. 10వ తేదీ రాత్రికి సిద్దల కూడు పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు చేపడతారు. ఏప్రిల్ 07న అమ్మవారి జాతర ముగుస్తుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు.

పట్ర కులస్తుల ఆత్మీయ సమావేశం

పులివెందుల : పట్టణంలోని ఎస్ఎస్‌బీ కల్యాణ మండపంలో పట్ర కులస్తుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ పట్ర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపోతుల హనుమంతరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల జనాభా కలిగి ఉన్నామని, గతంలో తమ కులస్తులు ఓసీ జాబితాలో ఉండేవారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బీసీ–ఎ జాబితాలో చేర్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బీసీలకు పెద్ద పీట వేయడంతో తమ కులస్థులు చాలా మంది ఎంపీపీలుగా, జడ్పీటీసీలుగా, సర్పంచులుగా, ఎంబీసీ డైరెక్టర్లుగా పదవులు చేపట్టారన్నారు. అనంతరం సంఘ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు చల్లా వెంకటనారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా సునీల్‌కుమార్‌లు తెలిపారు. వేముల ఎంపీపీ చల్లా వెంకటనారాయణ, ఎంబీసీ డైరెక్టర్ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కోశాధికారి రామానాయుడు, జిల్లా అధ్యక్షుడు గంగినాయుడు, పట్ర కులస్తులు పాల్గొన్నారు.